సాక్షి కామారెడ్డి

బుధవారం । 21 । మే । 2025



నిబంధనల ప్రకారం..
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిబంధనల మేరకే ఇళ్లను నిర్మించుకోవాలని అధికారులు సూచించారు.
- 9లో ▸



పేదల సంక్షేమమే లక్ష్యం
పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
38.7 /23.9
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రెండు సెల్‌ఫోన్ల చోరీ.. రెండేళ్ల జైలు

కామారెడ్డి క్రైం : ఓ ఇంట్లోకి ప్రవేశించి రెండు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన గుండ్ల రాజు ఇంట్లో 2016 మే 8న వేకువ జామున చోరీ జరిగింది. దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనం చేసిన వ్యక్తిని కామారెడ్డి పట్టణానికి చెందిన సద్దుల శంకర్‌గా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అప్పటినుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో కామారెడ్డి కోర్టు న్యాయమూర్తి సుధాకర్ మంగళవారం తీర్పు ఇచ్చారు. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు. నిందితునికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి క్రైం : వర్షాలతో ఆగమవుతున్న రైతన్న అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కామారెడ్డి గంజ్‌తో పాటు దేవునిపల్లి, లింగాపూర్, అడ్లూర్, చిన్నమల్లారెడ్డి, గర్గుల్‌లలోని కొనుగోలు కేంద్రాలను డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ ఆయా కేంద్రాలలో నిరంతరంగా కాంటాలు కొనసాగుతున్నాయన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తామని తెలిపారు.

'13,450 యూనిట్లు లక్ష్యం'



నాగిరెడ్డిపేట: రాజీవ్ యువ వికాసం ద్వారా జిల్లాలో 13,450 యూనిట్లు మంజూరు చేయాలన్నది లక్ష్యమని డీఆర్‌డీవో సురేందర్ పేర్కొన్నారు. మండల పరిషత్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. బ్యాంకులకు పంపిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మందకొడిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం బ్యాంకులకు వెళ్లి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీవో ప్రభాకరచారిని ఆదేశించారు. మండల పరిషత్ సిబ్బందికి ఐకేపీ సీసీలు సహకరించేలా చూడాలని ఏపీఎం జగదీశ్‌కు సూచించారు. అనంతరం వివిధ బ్యాంకులకు వెళ్లి రాజీవ్ యువవికాసం దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని మేనేజర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రాజీవ్ యువ వికాసానికి 41,547 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 12,624 దరఖాస్తులను బ్యాంకర్లు పరిశీలించారని పేర్కొన్నారు. మిగతావాటి పరిశీలన ప్రక్రియను రెండురోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

కామారెడ్డి ఆర్ట్స్ కళాశాలకు మరో పీజీ కోర్సు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు మరో పీజీ కోర్సు మంజూరయ్యింది. ఈ విద్యాసంవత్సరం నుంచి ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ పీజీ కోర్సును ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. 60 సీట్లతో పీజీ ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ కోర్సును మంజూరు చేస్తూ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. కళాశాలలో మొత్తం 12 పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిగ్రీ దోస్త్ ప్రవేశాలపై సందేహాలుంటే నేరుగా కళాశాలలో గానీ 94416 21456, 91823 04067 నంబర్లలోగాని సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

పదోన్నతి పొందినవారికి జిల్లాల కేటాయింపు

కామారెడ్డి క్రైం: ఎస్సైలుగా పదోన్నతి పొంది శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎస్సైలకు జిల్లాలను కేటాయిస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జిల్లాకు చెందిన పదకొండు మంది ఉన్నారు. జిల్లా పోలీస్ శాఖలో వివిధ విభాగాల్లో పనిచేసిన లచ్చీరాం, సిద్దిఖీ, సాదు లింబాద్రి, పి.గణేష్, ఉమేష్, మల్లారెడ్డి, సుబ్రహ్మణ్య చారి, సంజీవ్, నర్సింలు, రాములు, హన్మాగౌడ్‌లను సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు కేటాయించారు.



నిజాంసాగర్ రోడ్డులో నిలిచిన వరద నీటితో వాహనదారుల ఇబ్బందులు (ఫైల్)

ముంచుకొస్తోంది వానాకాలం..

ముంపు సమస్యకేదీ పరిష్కారం

- జిల్లా కేంద్రంలో అధ్వానంగా పరిస్థితి
- చిన్న వర్షానికే చెరువులను తలపించే రోడ్లు
- ఇళ్లలోకి వరద నీరు చేరి ఇక్కట్లు
- నాలాలు కబ్జాకు గురైనా పట్టించుకోని అధికారులు

వ్యాపార, వాణిజ్య కేంద్రంగా గుర్తింపు పొందిన కామారెడ్డి పట్టణం జిల్లా కేంద్రంగా ఎదిగినా పట్టణ రూపురేఖలు మాత్రం మారడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు పట్టణంలోని ప్రధాన రోడ్లు చెరువులను తలపిస్తాయి. వరద నీరు ఇళ్లలోకి చేరి ఇబ్బందిపెడుతుంది. ఏటా వానాకాలంలో సమస్య ఎదురవుతూనే ఉన్నా శాశ్వత పరిష్కారానికి పాలకులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో వర్షాకాలం వస్తుందంటే చాలు ప్రజలు వణికిపోతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కేంద్రంలోని చాలా ప్రాంతాల్లో నాలాలన్నీ కబ్జాకు గురయ్యాయి. విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీ, కాకతీయ నగర్, కొత్తబస్టాండ్ ప్రాంతాల మీదుగా వచ్చే వరద నీరు పోవడానికి ఎక్కడా నాలాలు లేకుండాపోయాయి. చాలాచోట్ల నాలాల ఆనవాళ్లు కూడా లేకుండా చేశారు. కొన్నిచోట్ల భవనాలు కట్టేశారు. మరికొన్ని చోట్ల కబ్జా చేసి ఆధీనంలో ఉంచుకున్నారు. దీంతో వరద నీరు పోయేదారి లేకపోవడంతో నీరంతా ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. విద్యానగర్‌లో సాయిబాబా గుడి ప్రాంతంలో నీరు నిలిచిపోయి గుడిలోకి కూడా వరద నీరు వచ్చి చేరుతోంది.

అలాగే విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీ, కాకతీయ నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అశోక్‌నగర్ రోడ్డులో చిన్న వర్షానికే వర ద నీరు రోడ్డుపైకి చేరి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. భారీ వర్షం కురిస్తే రాకపోకలు ఆగిపోవాల్సిందే. కొత్త బస్టాండ్ నుంచి రైల్వే గేటు మీదుగా కలెక్టరేట్‌కు ఇదే దారిగుండా వెళతారు. రోడ్డు అధ్వానంగా ఉండడం, అలాగే వర్షాకాలంలో నీరు నిలిచిపోతుండడంతో చాలా మంది వేరే రోడ్ల గుండా వెళుతున్నారు. అయ్యప్పనగర్ ప్రాంతంలోనూ ముంపు సమస్య ఉంది.



జిల్లాకేంద్రంలో ఇళ్లలోకి చేరిన వరద నీటిని తోడేస్తున్న దృశ్యం (ఫైల్)

పెద్ద చెరువు కాలువ సైతం..

పట్టణంలోని పెద్ద చెరువు అలుగు పారే నాలా సైతం కబ్జాకు గురైంది. ఇరువైపులా మట్టి నింపుతూ వచ్చి ఎక్కడికక్కడ నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఒకప్పుడు విశాలంగా ప్రవహించిన ఈ నాలా ఇప్పుడు చిన్న కాలువలా మారిపోయింది. గతేడాది అలుగు నీటి ప్రవాహంతో జీఆర్ కాలనీలోని ఇళ్లన్నీ వరద నీటితో మునిగిపోయాయి. అలాగే హౌసింగ్ బోర్డులో కొ న్ని ఇళ్లలోకి కూడా నీరు చేరింది.

ముందస్తు చర్యలు అవసరం...

వర్షాకాలం సమీపిస్తోంది. దీనికి తోడు ఈసారి రుతుపవనాలు ముందుగానే వస్తున్నాయన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావలసిన అవసరం ఉంది. జిల్లా కేంద్రంలో ముంపు సమస్య ఎక్కడెక్కడ ఉంది? దానికి పరిష్కారం ఏమిటి? అన్న దానిపై అధికారులు సమీక్షించి వెంటనే నాలాలు, డ్రెయినేజీలను శుభ్రం చేయించడంతోపాటు వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఏ రోడ్డు చూసినా..

వర్షాలు కురిసినపుడల్లా పట్టణంలోని ప్రధాన రోడ్లు చెరువులను తలపిస్తుంటాయి. సిరిసిల్ల రోడ్డు, స్టేషన్ రోడ్డు, నిజాంసాగర్ రోడ్డు, అశోక్‌నగర్ రోడ్లపై భారీ ఎత్తున వరద నీరు చేరుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏటా ఈ సమస్య ఎదురవుతూనే ఉంది. అప్పుడప్పుడు బల్దియా ద్వారా నీటిని తోడేసే ప్రయత్నం చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. అలాగే పట్టణంలో పలు కాలనీలలో డ్రెయినేజీలు కబ్జాకు గురయ్యాయి. దీంతో వర్షాకాలంలో వరద నీరు పోయేందుకు దారి లేక నీరంతా రోడ్లపై నిలిచిపోతూ ఇళ్లలోకి చేరుతోంది. వర్షపు నీరు సులువుగా వెళ్లేలా డ్రెయినేజీలు నిర్మించినా చాలాచోట్ల వాటిని ధ్వంసం చేశారు. ఎక్కడికక్కడ కబ్జాకు గురై నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.



ధైవభక్తి.. దేశభక్తి

రామారెడ్డి: దక్షిణ కాశీగా పేరుగాంచిన ఇసన్నపల్లి(రామారెడ్డి)లోని శ్రీకాలభైరవ స్వామి ఆలయంలో వైశాఖ మాస పూజలు కొనసాగుతున్నాయి. వైశాఖ మాసంలో చివరి మంగళవారం కావడంతో 108 రకాల పువ్వులతో స్వామి వారిని అలంకరించారు. ఈ క్రమంలో దైవభక్తితో పాటు దేశభక్తిని చాటుకున్నారు. మువ్వన్నెల పువ్వులతో స్వామివారి ముందు అలంకరించారు. అర్చకులు శ్రీనివాస శర్మ, వంశీకృష్ణ శర్మలు స్వామివారికి పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివారికి జలాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రామారెడ్డి పోలీసులు బందోబస్తు కల్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు గుప్తా, జూనియర్ అసిస్టెంట్లు లక్ష్మణ్, నాగరాజ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గంజి సతీశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



108 రకాల పువ్వులతో అలంకృతులైన కాలభైరవ స్వామి



పూజాదుల్లో పాల్గొన్న భక్తులు

జిల్లాలో రౌడీయిజాన్ని నిర్మూలిస్తాం

- ఎస్పీ రాజేశ్ చంద్ర
- సత్ప్రవర్తనతో మెలిగిన 13 మందిపై రౌడీ షీట్లు ఎత్తివేత



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం : జిల్లాలో నేరాలు, బెదిరింపులు, అక్రమ దందాలకు తావులేకుండా చేస్తామని, రౌడీయిజాన్ని నిర్మూలిస్తామని ఎస్పీ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రౌడీ షీట్ కలిగిన వ్యక్తులతో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'రౌడీ మేళా' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీట్లు ఉన్నవారు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలను బెదిరించడం, డబ్బులు వసూలు చేయడం, హింసాత్మక చర్యలకు పాల్పడడం లాంటి నేరాలను పూర్తిగా మానుకోవాలని సూచించారు. మంచి ప్రవర్తన కనబర్చిన వారి రౌడీ షీట్లు మాత్రమే తొలగిస్తామని తెలిపారు. పోలీసు రికార్డ్స్, రౌడీ షీట్స్ రివ్యూ కమిటీ నివేదిక ప్రకారం మంచి ప్రవర్తన కలిగి ఉన్న 13 మందిపై రౌడీషీట్లు తొలగించామన్నారు. ఇతరులలోనూ ఇలాంటి మార్పు రావాలని ఆకాంక్షించారు. సత్ప్రవర్తన కలిగి పదేళ్ల పాటు ఎలాంటి కేసులు లేకుండా ఉంటే నిష్పక్షపాత విచారణతో వారి రౌడీ షీట్స్ కూడా తొలగిస్తామన్నారు. గంజాయి, రౌడీయిజం, హత్యలు, హత్యాయత్నాలు, గొడవలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు తరచుగా పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో కత్తులతో ఫొటోలు పోస్ట్ చేయడం, రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడం, భయభ్రాంతులకు లోనయ్యేలా చేసే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి రౌడీ మేళా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రావు, విఠల్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ తిరుపయ్య, డీసీఆర్బీ సీఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

జిల్లాకేంద్రంలో మాక్‌డ్రిల్‌లో అధికారులు

కామారెడ్డి క్రైం : భారీ వర్షాలు, వరదలు సంభవించినపుడు వెంటనే సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాకేంద్రంలోని గురు రాఘవేంద్ర కాలనీలో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో విపత్తులపై అవగాహన కల్పించేందుకు మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. గతేడాది అధిక వర్షాలు కురిసినప్పుడు గురు రాఘవేంద్ర కాలనీ వాసులు ఇబ్బందులకు గురైన నేపథ్యంలో కాలనీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆర్డీవో వీణ తెలిపారు. అలాగే విపత్తుల సమయంలో ఎలా స్పందించాలన్న అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వరదలు సంభవించినపుడు ఆయా ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు తగిన జాగ్రత్త, ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి సుధాకర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ జనార్దన్, మున్సిపల్, ఫైర్, ఇరిగేషన్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫైర్ అధికారి సుధాకర్

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంలో ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. దేవునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు నూతన బోధన పద్ధతులపై అవగాహన పెంచుకుంటూ మిగతా ఉపాధ్యాయులను దిశానిర్దేశం చేయాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన విద్యాబోధన చేయాలన్నారు. తల్లిదండులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రాజు, అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి గంగాకిషన్, ఏసీజీఈ బలరాం, పరీక్షల కార్యదర్శి లింగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని 19వ వార్డు సాయిబాబా కాలనీలో జరీనా బేగంకు మంజూరైన ఇంటి నిర్మాణానికి మార్కవుట్ ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి దశల వారీగా బిల్లులు వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు వనిత, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోళ్లలో కొర్రీలు

- మిల్లర్లు ధాన్యం తిరస్కరిస్తే లారీ కిరాయి రైతే భరించాలి
- తరుగు విషయంలో మిల్లర్లతో మాట్లాడుకోవాలి
- ఒప్పంద పత్రం ఇస్తేనే ధాన్యం కొనుగోళ్లు
- కొత్త కండిషన్లతో ఇబ్బందిపడుతున్న రైతులు

బిచ్కుంద: బిచ్కుంద మండల కేంద్రంలో సింగిల్ విండో సొసైటీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. తేమశాతాన్ని పరీక్షించి కొనుగోలు చేస్తున్నారు. గడ్డిపోసలు, దుమ్ము ఉందని బస్తాకు అరకిలో తరుగు తీస్తున్నారు. అయితే దీనికి తోడు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఒప్పంద పత్రం అడుగుతున్నారు. నాణ్యత తక్కువ ఉన్న కారణంగా మిల్లర్లు వడ్లు తీసుకోవడానికి తిరస్కరిస్తే రవాణా ఖర్చులు తామే భరించుకుంటామని రైతులు ఒప్పంద పత్రం రాసి ఇస్తేనే వడ్లు కొనుగోలు చేస్తామని నిర్వాహకులు చెబుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. రైతు రాసిచ్చే ఒప్పంద పత్రం రైతుకు నష్టం చేసేదిగా, మిల్లర్లకు లాభం చేకూర్చే విధంగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాణ్యత, తేమ శాతం పరిశీలించి అన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తున్నప్పుడు ఒప్పంద పత్రం ఎందుకివ్వాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మిల్లుల్లో అదనపు కోత

వడ్ల లారీలను మిల్లులకు తరలించిన తర్వాత మిల్లర్లు వడ్లను రెండుమూడు బస్తాల నుంచి శాంపిళ్ల సేకరించి వడ్లలో నాణ్యత లేదు, తేమశాతం ఎక్కువగా ఉందని, బరువు తగ్గిందని వంకలు పెడుతూ లారీకి రెండుమూడు క్వింటాళ్ల వరకు తరుగు తీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి ఒప్పుకోకపోతే లారీ రిటర్న్ పంపిస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులు సైతం మిల్లర్లకే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రంలో తూకం వేసి ఇచ్చిన స్లిప్పును కాకుండా మిల్లు యజమాని వేసిన తూకాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఒప్పంద పత్రంలో రైతులు రాసి ఇవ్వాలని అధికారులు చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. లేదంటే రైతులే నేరుగా మిల్లుకు వెళ్లి మాట్లాడుకోవాలని సూచిస్తున్నారంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఒప్పంద పత్రం, వడ్లలో కోత లేకుండా చూడాలని కోరుతున్నారు.



కేంద్రాల్లో అధికారులు ఇస్తున్న ఒప్పంద పత్రం



బిచ్కుందలో వడ్లు ఆరబెడుతున్న రైతు

ఒప్పంద పత్రం ఇవ్వాలంటున్నరు

రైతులు ఒప్పంద పత్రం ఇస్తేనే వడ్లు కొంటామని అధికారులు చెబుతున్నారు. వడ్లు మిల్లుకు వెళ్లిన తర్వాత ఏదో వంకతో రెండు, మూడు క్వింటాళ్లు కట్ చేస్తున్నారు. మిల్లు యజమాని ఎంత తగ్గించినా ఒప్పుకోవాలనడం ఎంతవరకు న్యాయం. అధికారులు న్యాయం చేయాలి.

– శ్రీనివాస్, రైతు బిచ్కుంద

పైఅధికారుల సూచనలతోనే..

మిల్లులు క్వింటాలు వడ్లకు 65 కిలోల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది. యాసంగి వడ్లలో 65 కిలోల బియ్యం వస్తలేవట. నాణ్యత లేవంటూ వడ్లను రిటర్న్ పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పైఅధికారుల సూచనలతో రైతుల నుంచి ఒప్పంద పత్రం తీసుకుంటున్నాం.

– శ్రావణ్, సొసైటీ కార్యదర్శి, బిచ్కుంద

క్లుప్తంగా

నేడు బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



బాన్సువాడ రూరల్: మండలంలోని చిన్న రాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప మందిరంలో బుధవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ కుర్మ,యాదవ సంఘం ప్రతినిధులు కోరారు. బుధవారం ఉదయం దుర్కి వెంకట్‌రావు పంతులు ఆధ్వర్యంలో మండపారాధన, గోపూజ, విఘ్నేశ్వరాధన, పుణ్యాహవచనం, అంఖండ దీపారాధన, కలశారాధన, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్రహోమం, జలాధివాసం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

కుల బహిష్కరణపై ఫిర్యాదు

సదాశివనగర్: తనను మానసికంగా హింసిస్తూ కుల బహిష్కరణ చేసిన సంఘ సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కుప్రియాల్‌కు చెందిన కిష్టయ్య పద్మశాలి సంఘం సభ్యుడు. తాను పెట్టని ఓ పోలీసు కేసును తొలగించాలంటు సంఘ సభ్యులు హింసిస్తున్నారని అంతేకాకుండా గత మూడేళ్లుగా కుల బహిష్కరణ చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సదస్సును విజయవంతం చేయండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించనున్న తెలుగు శాఖ అధ్యాపకుల వార్షిక సదస్సును విజయవంతం చేయాలని పాఠ్యప్రణాళిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిగ్రీలో 120 క్రెడిట్స్‌కు బదులుగా తెలుగుకు 12 క్రెడిట్స్ మాత్రమే ఇస్తామని తెలియజేసిందన్నారు. దీనికి సంబంధించిన అంశంలో స్పష్టత తీసుకొచ్చి తెలుగు భాష గొప్పదనాన్ని ముందుకు తీసుకెళ్లే కార్యాచరణను సదస్సులో చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి తెయూ అనుబంధ కళాశాలల తెలుగు అధ్యాపకులు హాజరు కావాలని కోరారు.

జంగమాయిపల్లిలో రొయ్యల చెరువు

- ఐదు ఎకరాలలో రొయ్యలను సాగు చేస్తున్న మహిళా రైతు రజిత
- ఆదర్శంగా నిలుస్తున్న వైనం



మీసాల వనామీ రొయ్యలు



జంగమాయిపల్లిలో రొయ్యల చెరువు.. బోటు ద్వారా రొయ్యలకు దాణా అందిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని జంగమాయిపల్లిలో ఐదు ఎకరాలలో రొయ్యల చెరువును మహిళా రైతు రజితారెడ్డి ఏర్పాటు చేసింది. రైతులకు ఆదర్శంగా నిలుస్తోంది. ఎల్లారెడ్డి మండలంలోని జంగమాయిపల్లి గ్రామానికి చెందిన రజిత ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోని నెల్లూరు, చీరాల, బాపట్ల తదితర ప్రాంతాలకు విహార యాత్రకు వెళ్లింది. అక్కడి రైతులు సాగు చేస్తున్న రొయ్యల చెరువును చూసి వివరాలు తెలుసుకుంది. రైతుల వద్ద వారు సాగు చేస్తున్న విధానం, పద్ధతులను తెలుసుకుని గత నెలలో రొయ్యల చెరువును ఏర్పాటు చేసింది.

మూడు నెలల్లో రొయ్యల పంట..

రొయ్యలలో వనామి, టైగర్‌లాంటి రకరకాల రొయ్యలు ఉంటాయి. వీటిలో రజిత వనామి అనే రకానికి చెందిన రొయ్యలను సాగు చేస్తున్నది. ఐదు ఎకరాల సాగులో ఉన్న రొయ్యల చెరువులో 11 లక్షల రొయ్య పిల్లలను ప్రస్తుతం సాగు చేస్తున్నారు. రొయ్యలకు ప్రతి రోజుల నాలుగు పూటలు దాణాను వివిధ రకాల పద్ధతుల్లో అందిస్తున్నారు. వీటిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సి ఉంటుంది. 24 గంటల పాటు వెలుతురు, ఆక్సిజన్ అందించాల్సి ఉంటుంది. పాములు రాకుండా ఫెన్సింగ్, పక్షులు రాకుండా నెట్ ఏర్పాటు చేశారు. వెంట్రుక మందంలో ఉన్న మీసాల రొయ్యలు మూడు నెలల పాటు వాటికి దాణా అందిస్తారు. మూడు నెలల తరువాత వాటిని విక్రయిస్తారు. కిలో రూ. 350 ధర పలకడంతో వాటి ద్వారా లాభాలను ఆర్జించవచ్చు. రొయ్యల విక్రయాలను హైదరాబాద్, కోల్‌కత్తా ఏజెన్సీ ద్వారా విదేశాలకు ఎక్స్‌పోర్టు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వం రుణాలను అందించాలి



ఆంధ్రా రైతులను ఆదర్శంగా తీసుకుని రొయ్యల చెరువును ఏర్పాటు చేశాను. తెలంగాణాలో రొయ్యలను తినే వారు చాలా మంది ఉన్నారు. ఇక్కడ దొరకక పోవడంతో ఇతర ప్రాంతాల నుంచి అధిక ధరలకు కొనుక్కుంటున్నారు. రొయ్యలు ఎక్స్‌పోర్టు కావడంతో ఇవి లభించడం చాలా అరుదు. తన వ్యవసాయ పొలంలో రొయ్యల చెరువులను తవ్వి రొయ్యల సాగు చేస్తున్నాను. ఇదే మొదటి పంట. లాభాలు రావాలని కోరుకుంటున్నాను. రొయ్యల చెరువులకు సైతం ప్రభుత్వం రుణాలను అందిస్తే మరింత మంది రైతులు రొయ్యల చెరువులను సాగు చేస్తారు.

– రజిత, మహిళా రైతు, జంగమాయిపల్లి

అక్రమాల్లో పెత్తనం

- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం
- ఉద్యోగ సంఘం నాయకుడి తీరుపై మండిపడుతున్న ఉద్యోగులు

నిజామాబాద్‌అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ వారి వెన్నంటే ఉండి నడిపించే వాడు నాయకుడు.. కానీ ఓ ప్రధాన సంఘం నాయకుడు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు. తాను చెప్పిందే వేదమని.. తాను చేసే పనులకు ఎవరైనా అడ్డొస్తే సహించేది లేదంటు తరచూ ఉద్యోగులపై మండిపడుతున్నాడు.

అక్రమాలకు ఆదేశాలు

జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖలో టీఎన్జీవోస్ సంఘానికి చెందిన ఓ ఉద్యోగి, అతని భార్య పనిచేస్తున్నారు. వీరు పక్కపక్కనే ఉండే రెండు భవనాల్లో పనిచేస్తున్నారు. ఇద్దరు ఒకే దగ్గర పనిచేసేలా సదరు నాయకుడు ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆదేశాలు ఇప్పించారు. కామారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కొన్ని రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇందుకు సంఘం నాయకుడే ప్రధాన కారణమని తెలిసింది. ఇటీవల వ్యవసాయశాఖలో ఓ ఉద్యోగి మరణించాడు. అతనికి సంబంధించి బెనిఫిట్స్ రాకుండా అడ్డుపడినట్లు తెలిసింది. అంతేకాకుండా డివిజన్ల వారిగా టీఎన్జీవోస్ సమావేశాల్లో ఉద్యోగులపై తనకు సహకరించకుంటే సహించేది లేదంటూ తరచూ బెదిరింపులకు పాల్పడడం కొనసాగుతోంది.

మండిపడుతున్న సంఘం ఉద్యోగులు

టీఎన్జీవోస్‌లో సంఘం నాయకుడి వ్యవహారశైలిపై మిగతా కార్యవర్గ నాయకులు మండిపడుతున్నారు. నాయకుడి తీరుపై రాష్ట్ర కమిటీని కలిసి ఫిర్యాదు చేస్తామని టీఎన్జీవోస్‌కు చెందిన ఓ సీనియర్ నాయకుడు తెలిపారు. ఇటీవల సమావేశాలు నిర్వహించి సంఘానికి సంబంధించిన ఖర్చుల వ్యవహారం వెల్లడించకపోవడంపై కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అంజయ్య

ఖలీల్‌వాడి: యువత మత్తుకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీసీపీ శ్రీనివాస్‌రావు సూచించారు. నగరంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో మంగళవారం గంజాయికి అలవాటు పడిన యువకులతో పాటు వారి తల్లితండ్రులకు టాస్క్‌ఫోర్స్ సీఐ ఆర్ అంజయ్య, టాస్క్‌ఫోర్స్ ఎస్సై గోవింద్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. అందమైన జీవితాన్ని మత్తుకు బానిస కాకుండా చూసుకోవాలని యువకులకు సూచించారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా మత్తు పదార్థాలు సరఫరా చేసినా, గంజాయి పెంచినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా గంజాయి రవాణా చేసినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు.

ఉద్యాన పంటలసాగును ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో మహిళలను ఉద్యానపంటలసాగుకు ప్రోత్సహించాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉద్యానపంటల సాగుతో మహిళలు ఆర్థికంగా స్థిరపడతారని ఆయన చెప్పారు. ఉద్యాన పంటలను సాగుచేసిన రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వాహణ ఖర్చులు చెల్లిస్తామన్నారు. మునగపంటను సాగు చేసే రైతులకు గుంతలు తీసేందుకు, నీళ్లు పట్టేందుకుగానూ ఉపాధిహామీ ద్వారా డబ్బులు వస్తాయని ఆయన చెప్పారు. కాగా నాగిరెడ్డిపేట మండలంలో బ్యాంకులింకేజీ ద్వారా 683సంఘాలకు రూ.36కోట్ల80లక్షలు రుణాలుగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. లక్ష్యం నెరవేర్చేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని ఆయన చెప్పారు. దీంతో పాటు స్త్రీనిధి రుణాల రికవరీని వందశాతం చేపట్టాలని ఆయన సూచించారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బేస్త శాంత, స్త్రీనిధి మేనేజర్ కిరణ్, ఏపీయం జగదీశ కుమార్, సీసీలు నారాయణ, దత్తు, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, రషీద్, సుజాత, అకౌటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈ చొరవతో విద్యుత్ లైన్లకు మరమ్మతులు



బీబీపేట: మండలంలోని ఇస్సానగర్ గ్రామంలో గతేడాది నుంచి వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ వైర్లు కిందకి ఉండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ సోమవారం గ్రామంలోని వ్యవసాయ బావుల వద్ద ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో అక్కడున్న రైతులు సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన 10 ఇంటర్ పోల్స్ వెంటనే వేయాలని సిబ్బందికి సూచించారు. మంగళవారం ఇంటర్ పోల్స్‌ను సిబ్బంది మరమ్మతులు చేసి అమర్చారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ సిబ్బందికి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఈఈ కల్యాణ్ చక్రవర్తి, ఏడీఈ సుదర్శన్ రెడ్డి, ఏఈ విజయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

వదంతులను నమ్మవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

నవీపేట: బక్రీద్ పండగ నేపథ్యంలో లేనిపోని పుకార్లను నమ్మవద్దని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు. పీఎస్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవులను తరలిస్తున్నట్లు సమాచారం వస్తే ముందుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడికి తీవ్రగాయాలు

కామారెడ్డి టౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ వైద్యుడికి తీవ్రగాయాలైన ఘటన కామారెడ్డి పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన శ్రీనివాస్ ఎల్లారెడ్డి ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం పని నిమిత్తం బైక్‌పై బయటకు వెళ్లి ఇంటికి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొన్నది. కిందపడడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌కు అంబులెన్స్‌లో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాడ్సిలో రేకుల షెడ్డుకు నిప్పు

మోపాల్: మండలంలోని బాడ్సి గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు నల్ల శశాంక్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న రేకుల షెడ్డుకు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి నిప్పు పెట్టారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం శశాంక్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పరికరాల కోసం షెడ్డును నిర్మించుకున్నాడు. రాత్రి 1.30 గంటల సమయంలో రోడ్డుపై వెళ్తున్న గ్రామస్తులు షెడ్డుకు నిప్పంటుకున్న విషయాన్ని శశాంక్‌కు ఫోన్ ద్వారా చెప్పడంతో వెంటనే పోలీసులకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. కానీ అప్పటికే షెడ్డులో ఉన్న పైపులు, ట్రాక్టర్ టైరు, ఇతరత్ర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. అక్కడే ఏర్పాటు చేసిన తన తండ్రి నల్ల చిన్న సాయిరెడ్డి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. సీఐ సురేశ్, ఎస్సై యాదగిరి గౌడ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. శశాంక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. రూ.20వేల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు.

గాంధీనగర్‌లో దొంగల బీభత్సం

నవీపేట: మండలంలోని గాంధీనగర్‌లో ముసుగులు ధరించిన దొంగల ముఠా సోమవారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించింది. గుర్తు తెలియని 8 మంది గ్రామంలోకి చొరబడి అన్ని ఇళ్ల తాళాలను పగులగొట్టేందుకు యత్నించారు. సుదర్శన్‌కు చెందిన కిరాణ దుకాణం షట్టర్‌ను తొలగించి లోపలకు ప్రవేశించారు. చప్పుడు రావడంతో మేల్కొన్న గ్రామస్తుల అలజడికి దొంగలు పారిపోయారు. ఈ దృశ్యాలు గ్రామంలో అమర్చిన సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. దొంగలను పట్టుకుంటామని నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

ముంబోజీపేటలో ఒకరి అదృశ్యం



లింగంపేట: మండలంలోని ముంబోజీపేట గ్రామానికి చెందిన పస్కూరి కాశీరాం అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై వెంకట్రావు మంగళవారం తెలిపారు. మూడు రోజుల క్రితం భార్య రాణితో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

ఖలీల్‌వాడి: అనారోగ్యంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వినాయక్‌నగర్‌కు చెందిన దోమల చంద్రకళ(55) ఆరు నెలలుగా అనారోగ్యంతో పాటు మానసికంగా బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాలేదు. దీంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త ధర్మాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ల్యాప్‌టాప్ అప్పగింత



రాజంపేట: పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను రికవరి చేసి బాధితుడికి అందించినట్లు ఎస్సై పుష్పరాజ్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన వెంకోళ్ల యాదగిరి 15 రోజుల క్రితం తన ల్యాప్‌టాప్‌ను పోగొట్టుకున్నాడు. పోలీసులు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ అనుమానిత వ్యక్తిని విచారించారు. డేటాబేస్ ఆధారంగా ల్యాప్‌టాప్‌ను పట్టుకుని బాధితుడికి అందించినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు చిరంజీవి, చరణ్ ఉన్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి

ఖలీల్‌వాడి: పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై దాడి జరిగిన ఘటన నగరంలోని మైఫిల్ హోటల్ వద్ద జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌కు చెందిన సాయికుమార్, సాయినాథ్‌లకు గతంలో పాత కక్షలు ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి సాయికుమార్ తన స్నేహితుడైన శివ బర్త్‌డే వేడుకల్లో పాల్గొని మంగళవారం ఉదయం 3 గంటలకు మైఫిల్ హోటల్ వద్దకు వచ్చారు. కాగా అక్కడే ఉన్న సాయినాథ్ వీరిని పలుకరించాడు. సాయికుమార్‌ను పక్కకు రావాలంటు సాయినాథ్ కోరడంతో అతను వెళ్లాడు. తనపై గణేశ్ ఉత్సవాల్లో ఎందుకు పోలీస్ కేసు పెట్టావంటు జేబులో ఉన్న బ్లేడ్‌తో సాయికుమార్ గొంతుపై దాడి చేశాడు. వెంటనే స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నందిపేట్‌లో యువకుల ఘర్షణ



నందిపేట్: మండల కేంద్రంలోని బస్‌డిపో స్థలంలో గుర్తు తెలియని యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన కొండూర్ రమేశ్ అనే వ్యక్తి సోమవారం రాత్రి మద్యం తాగేందుకు స్థానిక బస్ డిపో స్థలానికి వచ్చాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల మధ్య రమేశ్‌కు గొడవ జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో రమేశ్‌కు తీవ్రగాయాలు కావడంతో అచేతన స్థితికి చేరాడు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకు వివరాలు సేకరించారు. నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హోన్నాజీపేట్‌లో చోరీ



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ధర్పల్లి: మండలంలోని హోన్నాజీపేట్‌లో చోరీ జరిగినట్లు ఎస్సై రామకృష్ణ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తొంటకొల్ల గంగారం సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి దాబాపై నిద్రపోయారు. విషయం గమనించిన దుండగులు రాత్రి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి ఆభరణాలు, రూ. మూడు లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బంక్‌లో డీజిల్..

మోపాల్: మండలంలోని కాస్‌బాగ్ తండా శివారులో ఉన్న ఇండియన్ బంక్‌లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 154 లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు బంక్ వెనక వైపు నుంచి లోపలికి వచ్చి సీసీ కెమెరాలను నిలిపేశారు. ఆ తర్వాత బంక్‌లోని ఆన్‌లైన్ సిస్టమ్‌ను బ్రేక్ చేశారు. డీజిల్ గన్‌ను అన్‌లాక్ చేసి రూ.14,951 విలువైన 154 లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. ఈవిషయమై ఎస్సై యాదగిరి గౌడ్ వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ శివారులోని పంట పొలాల్లో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి. పట్టణ కేంద్రానికి చెందిన రైతు రాజేశ్ తనకున్న రెండు గేదెలను తీసుకొని శివారు ప్రాంతానికి మేత కోసం తీసుకెళ్లాడు. అక్కడ మేత మేస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తెగి పడి రెండు గేదెలపై పడ్డాయి. ఈ ఘటనలో అవి మృతి చెంది. పక్కనే ఉన్న మరో 20 గేదెలు, పశువలకు పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ ఏడీఈ కృష్ణ చైతన్య, మండల పశువైద్యాధికారి రవికిరణ్, రెవెన్యూ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

మహిళ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం/ ఎల్లారెడ్డి: రేకుల షెడ్డు విషయంలో కక్ష పెంచుకుని ఓ మహిళను హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన షేక్ కరీముల్లా తన ఇంటికి ఆనుకుని వసీముద్దీన్ అనే వ్యక్తి రేకుల షెడ్డు నిర్మించాడు. ఈ విషయంలో రెండు కుటుంబాల మధ్య పలుమార్లు గొడవ జరిగింది. ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ అధికారులు షెడ్డును కూల్చివేశారు. దీంతో కరీముల్లా భార్య అయిన వసీమా బేగం పై వసీముద్దీన్ కక్ష పెంచుకున్నాడు. ఆమె 2022 మే 10న ఇంటి ఎదుట కూర్చుని ఉండగా ఇనుప రాడ్డుతో దాడి చేసి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన ఎల్లారెడ్డి పోలీసులు వసీముద్దీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌వీ ఆర్‌ఆర్ వర ప్రసాద్ నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన అప్పటి ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్, ప్రస్తుత సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేశ్, పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, కోర్టు లైజనింగ్ అధికారి ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, సిబ్బంది సాయిలును ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

దాడి చేసిన ఘటనలో ముగ్గురికి రెండేళ్ల జైలు

వర్ని: మంత్రాలు చేస్తున్నారనే నెపంతో దాడికి పాల్పడిన ముగ్గురికి రెండేళ్ల జైలు శిక్షను బోధన్ అదనపు జడ్జి సాయి శివ మంగళవారం విధించినట్లు వర్ని ఎస్సై మహేశ్ తెలిపారు. 2017లో వర్ని మండలం సిద్దాపూర్‌కు చెందిన దౌలత్ రావు, శంకర్, సరిచంద్ అనే వ్యక్తులు అదే గ్రామానికి చెందిన పద్మ, మాణిక్యంద్‌లు మంత్రాలు చేస్తున్నారనే నెపంతో దాడి చేశారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి దాడికి పాల్పడిన ముగ్గురికి రెండేళ్ల కఠిన కారాగార శిక్షను విధించినట్లు ఎస్సై తెలిపారు.

బోధన్‌లో ఐదుగురికి..

బోధన్‌టౌన్: రాత్రి వేళల్లో దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తెరిచి ఉంచిన నలుగురితో పాటు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన మరొకరికి జైలు శిక్ష పడినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బోధన్‌లో రాత్రి వేళల్లో దుకాణాలు తెరిచి ఉంచుతున్న ఇద్దరు ఫాస్ట్‌ఫుడ్, మరో ఇద్దరు దాబా నిర్వాహకులతో పాటు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరు పర్చగా జడ్జి శేషతల్ప సాయి ఒక రోజు జైలు శిక్షను విధించినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి..

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఐదుగురికి స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం జైలు శిక్షను విధించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పీఎస్‌లలో పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో 21 మంది పట్టుబడగా వారికి కౌన్సెలింగ్ చేపట్టి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. వీరిలో నలుగురికి రెండు రోజులు, ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

పొతంగల్ కలాన్‌కు చెందిన ఒకరికి..

రుద్రూర్: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్షను బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి విధించినట్లు కోటగిరి ఎస్సై సునీల్ మంగళవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పొతంగల్ కలాన్‌కు చెందిన ఇమ్రాన్‌కు ఒక రోజు జైలు శిక్ష, రూ. నాలుగు వేలు జరిమానా విధించారు. అదేవిధంగా కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన శేఖర్‌కు రూ. రెండు వేలు జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు ఎస్సై తెలిపారు.

మోపాల్‌కు చెందిన మరొకరికి..

మోపాల్: మండల కేంద్రంలో ఈనెల 18న నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో న్యాల్‌కల్‌కు చెందిన మునిపల్లి సునీల్‌కు మంగళవారం మెజిస్ట్రేట్ నూర్జహాన్ మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గాయపర్చిన ఒకరికి రెండేళ్ల జైలు

ఖలీల్‌వాడి: రైల్వే ట్రాక్‌పై పాతిపెట్టిన జెండా విషయంలో గొడవపడి తోటి గ్యాంగ్‌మన్‌ను తీవ్రంగా గాయపర్చిన మరో గ్యాంగ్‌మన్‌కు రెండేళ్ల జైలు శిక్షను విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి పమూజుల శ్రీనివాస్‌రావు మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ కార్యాలయంలో గ్యాంగ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ అహ్మద్ హుస్సేన్ 28జనవరి2016 న ఇందూర్ క్యాన్సర్ ఆస్పత్రి దగ్గరలో ఉన్న రైల్వే ట్రాక్‌పై జెండాను పాతి పెట్టాడు. ఇతనికి దూరంగా పనిచేస్తున్న మరో గ్యాంగ్‌మన్ సురేశ్ తనకు జెండా అవసరం ఉందంటు హుస్సేన్ దగ్గరికి వచ్చాడు. తన దగ్గర ఉన్న ఒక్క జెండాను పాతిపెట్టానని హుస్సేన్ తెలుపడంతో గొడవ జరిగింది. సురేశ్ కోపంతో ఇనుప సుత్తెతో హుస్సేన్‌పై దాడి చేశాడు. దీంతో కేసు నమోదైంది. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. విచారణలో సురేశ్ నేరం చేసినట్లు రుజువు కావడంతో జడ్జి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు.